# ఐదవ అధ్యాయం

## కడప కథల్లో

## భాషాపరిశీలన

# 5

## 5.0.

తమ అభిప్రాయాలను ఆలోచనలను ఎదుటి వారికి తెలియజెప్పడానికి దోహదపడేదే భాష. భాష ద్వారానే సమాచార వినిమయం జరుగుతుంది.

కడప కథారచన సరళ భాషలో ఉంది. అలంకారిక రచన గానీ, పద గుంఫన శైలిగానీ కన్పించదు. ప్రాంతీయ మాండలిక పదాలు కానీ, కుల మాండలిక పదాలు కానీ ఎక్కువగా చోటు చేసుకోలేదు. కడప కథల్లోని భాష వ్యవహారిక భాష. ఈ కథల్లోని భాష ఏ ప్రాంతానికి చెందిన తెలుగు పాఠకులకైనా దాదాపుగా అర్థమవుతుంది. ఏ బాషకైనా జాతీయాలు, సామెతలు, జంట పదాలు, ధ్వన్యనుకరణ శబ్దాలు, సాదృశ్యాలు ప్రాణసమానాలు. ఏ రచయిత శైలిలో నైనా ఇవి సమృద్ధిగా ఉన్నప్పుడే రచనారమణీయకత్వం వెల్లివిరుస్తుంది.

'కడపకథ' సంకలనంలోని కథల్లో రచయితలు సామెతలు, జాతీయాలు, జంట పదాలు, ధ్వన్యనుకరణ శబ్దాలు ప్రయోగించి, ఆయా పాత్రలకు సంభాషణలకు కథాగతికి వన్నె తెచ్చారు. మాండలిక శైలిలో ఆ ప్రాంతానికి పరిమితమైన మాండలిక పదాలు చోటు చేసుకున్నాయి. వీటన్నింటినీ ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

అవి:- 5.1. మాండలిక పదాలు　　5.2. జాతీయాలు
5.3. సామెతలు　　5.4. జంట పదాలు
5.5. ధ్వన్యనుకరణ శబ్దాలు　　5.6. సాదృశ్యాలు.

## 5.1. మాండలిక పదాలు

కథలోని సజీవతను కలకాలం కాపాడుకోవాలంటే మాండలికమే సరైన సాధనమని గుర్తించిన నేటి కథా రచయితలు ఆ శైలిలో కథాసాహిత్యాన్ని కొనసాగిస్తున్నారు. వాస్తవ ఘటనలకి కథా రూపం ఇవ్వడంలో రచయితలు ఎంతో నేర్పు చూపాలి. లేకుంటే కథలు గతాన్ని తవ్విపోసే చరిత్రలాగానో, వర్తమానాన్ని వ్యాఖ్యానించే రాజకీయం లాగానో కనిపించే ప్రమాదం ఉంది. జీవితాల్లోని అనుభూతిసాంద్రత, అనుభవప్రగాఢత సమపాళ్లలో చోటుచేసుకోవడం ద్వారా ఈ కథలు పరిపూర్ణ కళగా రూపొందాయి.

ఒక రకంగా ఏ ప్రాంతానికి చెందిన రచయితలకు వారు ఉపయోగించిన ఆ ప్రాంతీయ భాషే ఆయా కథా రచయితలను ప్రజలకు ఆత్మీయుల్ని చేయగలిగింది. ప్రజలు తమదని ఆదరించిన సాహిత్యమే ప్రజాసాహిత్యం.

కడప రచయితలు ప్రామాణిక భాషలో ఆద్యంతం కథను నడిపించారు. వీరి 'కడప కథ' కథా సంకలనంలో ఉన్న మాండలికాలను ఇక్కడ పరిశీలించడం జరిగింది. అయినా వారు పుట్టి పెరిగిన ప్రాంతంలోని మాండలిక పదాలు అప్రయత్నంగానే వారి రచనల్లో చోటు చేసుకున్నాయి.

(1) దిమ్మెరపోయి - ఆశ్చర్యపోయి
"నీలవేణి... వా...? నేను దిమ్మెరపోయి ప్రశ్నించాను".
(నీలవేణి - పు : 2)

(2) పూసుకొని - అనుకొని, రాసుకొని
"అతని వెంట యింట్లోకి పోవడానికి పూసుకొని కళ్యాణి ఒకడుగు ముందుకు వేసింది".
(నీతిగానుగ - పు : 29)

(3) కులకడం - సంబరపడడం
"కాకపోతే ఏమిటి? మొగుడు చస్తే మళ్లీ పెళ్లి చేసుకుని కులకడం మన సాంప్రదాయమా!".
(సంస్కరణ - పు : 50)

(4) కూకోకుండ - కూర్చోకుండ
"అదీ నేను చనం కూడా కూకోకుండ పన్జేత్త గాని యాడాది పొడుగూ కూటికి జరగదు".
(రాములవారి గుడి ముందు - పు : 66)

(5) దోపుకొను - దాచుకొను
"పాండురంగం కూడా ఆవిడను గమనించాడు. నోరు తెరచుకొని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. రాగానే బొడ్లో దోపుకున్న డబ్బు తీసిచ్చింది ఆమె".
(జవాబు లేని ప్రశ్న - పు : 77)

(6) మోడి పెట్టు - మొండికేయుట, తిరస్కరించుట.
"గంగిరెడ్డిని చూడాలని అక్కడి నుండి పోయి గంగిరెడ్డితో ప్రస్తావించినాడు. గంగిరెడ్డి చాలా సేపు మోడిపెట్టినాడు".
(దొంగ బర్రెగొడ్లు - పు : 81)

(7) బొత్తిగా - పూర్తిగా
"పాపం రామ్మూర్తి అమాయకుడు. కలిపి చెప్పాలంటే గానుగెద్దులా తన చేస్తున్న ఉద్యోగ విషయాలు ఆఫీసు సంగతులు తప్పితే బయట ప్రపంచం బొత్తిగా తెలియనవాడు".
(అలక పాన్పు - పు:83)

(8) దావ - దారి
"హరిజనవాడకు దావ ఇదేనా? ఎర్రసంచి అయప్ప అడిగినాడు"
(తొందరపడి ఒక కోడి ముందే కూసింది - పు : 131)

(9) మద్దిస్తం - పంచాయితీ, తీర్పు చెప్పే చోటు
"రాజమ్మ మద్దిస్తం సంగతి వినగానే దిగులుగా నిలబడి పోయింది"
(కువైట్ సావిత్రమ్మ - పు : 139)

(10) పెడసరంగా - గర్వంగా, కోపంగా
"ఆచారాలు వదులు కోవాలా? అన్నాడు పిచ్చిరెడ్డి పెడసరంగా".
(పాడె - పు : 185)

(11) తావు - చోటు, స్థలం
"నా కొడుకులు తావు సాల్దంటాంద్రు"
(చనుబాలు - పు : 192)

(12) తాట - తోలు, చర్మం
"భద్రం! మీ నాయన నీ తాట ఒలుస్తాడు, అని భయం పెట్టింది".
(చుక్క పొడిచింది - పు : 241)

(13) రవ్వ - కొంచెం
"అది గాదురా! నేం గట్టినయ్ కూడా తెచ్చి. ఒక్క రవ్వ పెద్ద జీవం గదాని వుర్జనలైతే బాగుందనుకుంటే ఈ టెక్క ఇయి పేలక పాయె" అనే సిన్నిగాడు.
(సిన్నిగాడి సికారి - పు : 251)

(14) లెక్క - డబ్బు
"ఇంతకూ నువ్వు చేసిన మూడు ఖూనీలకు లెక్కెంతిచ్చినాడు నాగిరెడ్డి?" కొడుకు వేసిన దెబ్బలాంటి ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాడు నరసింహులు.
(చంద్రగ్రహణం - పు : 277)

(15) చెతుర్లు - తమాషా, ఎగతాలి
"తోలు బొమ్మలతో, నలుగురిని జమ చేసుకొని ఊర్లు తిరిగి బతికె మీతో, మాకు చెతుర్లు ఎందుకోయ్ ... నిజంగానే ఆ బొమ్మ నచ్చింది... అడుగుతున్నాం" మరో చెవి పోగు యువకుడు దురుసుగా మాట్లాడాడు.
(కడుపాత్రం - పు : 291)

(16) గబుక్కున - త్వరగా, వెంటనే
"రేయ్ ... నిన్ను మీ నాయనా గబుక్కున రమ్మంటాండాడు రా... అన్నాడు".
(శిలబండి - పు : 313)

(17) దుడ్లు - డబ్బులు

"నువ్వేమన్నా దుడ్లు తీసుకున్నావా?" ఆందోళన, ఆతృత కలగలిసిన ఏడుపు గొంతులో మొగున్నడిగింది ఎంకి.

(అబల - పు : 341)

(18) ఆత్రం - తొందర

"ఇంట్లో ఒక మూలన కుక్కి మంచంలో ఉబ్బసంతో అల్లాడుతున్న తల్లి దగ్గరకు ఆత్రంగా పోయినాడు".

(కరవు రాగం - పు : 351)

(19) ఆర్సుకొని - చల్లార్చుకొని

"మాల్దయితేనేం? అది మనిసి గాదూ! ఆర్సుకోని ఆర్సుకోని బరుగొడ్డు పాల్దాగుతరే అంతకన్నా యీనమైందా అది?"

(చనుబాలు - పు : 201)

(20) ఆయపిండ్లు - సామాన్ల గది.

"తమిద్దరి దాంపత్య జీవితాన్ని ప్రారంభించమని అనుమతి ఇచ్చింది. ఒక చీకటి కొట్లో. దాన్ని ఆయపిండ్లు అంటారు. అటువంటిది అన్ని ఇండ్లలోనూ వుంటుంది. అందులో కొద్దిపాటి ధాన్యమూ, మిరపకాయలూ, చింత పండూ వంటిది దాచుకున్న గాదెలూ, వాడలూ ఉంటాయి".

(మనిషీ - పశువూ - పు : 217)

(21) గతికిందేలే - తినిందిలే.

"ఈ స్టేషన్ మన పార్టీ దగ్గరా గతికిందిలే! అందుకే ధైర్యం".

(కూలిన బురుజు - పు : 105)

(22) గాసగాడు - జీతగాడు

"ఒంటరిగా ఉన్నప్పుడు యంగముని కొత్తూరు రెడ్డింట గాసగాడు. ఎప్పుడూ బదులు సదుళ్ళకు, సలహా సంప్రదింపులకు రెడ్డిని ఆశ్రయిస్తుంటాడు".

(యంగముని వ్యవసాయం - 407)

(23) గుమ్మ - బొంగరాన్ని కొట్టడం.

"గిరిలో వున్న బొంగరాన్ని గురిజూసి కాలెత్తి నా బొంగరంలో గుమ్మ గొడితే రెండుగా విచ్చి గిరికి అటు ఇటు చెక్కలయ్యేది".

(చనుబాలు - పు : 195)

(24) జంబాలం - బంధం

"నా అయేకంగాకపోతే నేనెందుకీ జంబాలంలో ఇరుక్కోవాల? రెడ్డింట తినితొంగొని బాదంటూ లేక హాయిగా వుంటి".

(యంగముని వ్యవసాయం - పు : 410)

(25) తట్టిడిసిండు - వీపు పై చరడం.

"ఏందోయ్ ... బయపన్నావ్, అదురు నాయాలా! అంటూ అదురు పోయేదానికి ఈపు తట్టిడిసిండు".

(సిన్నిగాడి సికారి - పు : 251)

(26) దణ్ణెం - బట్టలు ఉంచునది.

"అందులోనే బట్టలు వేసుకునే దణ్ణెం వుంటుంది. ఇంకా ట్రంకు పెట్టెలూ, వుంటే బోషాణాలూ వుంటాయి".

(మనిషీ - పశువూ - పు : 217)

(27) పిడ్స - ముద్ద

"యాడికో యీదెక్కి పోతాంది. వూరంతా దిరిగినా పెసిడెంటు ఇంటికాన్నే గాదూ దానికింత పిడ్సబుట్టేది" గురన్న అన్నాడు.

(చనుబాలు - పు : 189)

(28) పిర్రెం - ఎక్కువ ధర.

"అవును కరెంటు కావుద్దు. కరెంటు లాకుండానే మోటరాడుతాదా ఏంది? కరెంటు మాహా పిర్రెం కరెంటోళ్ళు కరెంటు కన్నా పిశేచం".

(జీపొచ్చింది - పు : 300)

(29) బింగిరేగి - కోపం

"యివన్నీ తేలే దాకా రామును నన్ను చూడనివ్వరా యేం? అన్నా బింగిరేగి".

(ఓబిగాడు - పు : 94)

(30) బిరీనపో - తొందరగా వెళ్ళు.

"గడ్డిమోపుతో ఎదురైన నాగమ్మ మాత్రం 'ఎక్కడికి'? అని అడిగినాక, ఎక్కడికో చెబితే 'ఓహో'! అని నవ్విందంట. నవ్వి పో... పో! బిరీనపో! ఆకలితో నీకోసమే సూస్తా వుంటాడు రామిరెడ్డి పాపం!".

(మనిషీ - పశువూ - పు : 219)

(31) బురుజు వీధి - ఉత్తర దక్షిణం వీధి.

"వంకర టింకర లేని పొడుగాటి ఉత్తర దక్షిణం వీధి. దీన్ని బురుజు వీధి అంటారు. ఇది నేరుగా తూర్పు పడమర వీధిలో వూరబావి వద్ద కలుస్తుంది".

(కొత్త చిగురు - పు : 336)

(32) యాసన - తెలివి.

"ఆ మాత్రం యాసన ల్యాకుండానే మనల్ను పార్టీలోకి దించుతాడా నాగిరెడ్డి? నమ్మకంగా అన్నాడు నరసింహులు.

(చంద్ర గ్రహణం: - పు : 279)

(33) యూరముట్లు - పనిముట్లు

"యూరముట్లు ఏమిటి? అని అడిగా పెదనాన్నను. పనిముట్ల అర్థంలో వాడలేదని తెలిసి. అవే మన దగ్గర పెట్టుకునేవి అవసరానికి ... బాంబులు, పిస్టల్ లాంటివి అన్నాడు పెదనాన్న".

(కూలిన బురుజు - పు : 102)

(34) యెంపర్లాడతారా - వెతకటం.

"ఆ మాలోల్ల కాడ లంచమిచ్చినంత లెక్క యాడిది సామీ? అదే వుంటేగిన ఉద్దరగొచ్చే భూమి కోసరం యెంపర్లాడతారా?" ఆశ్చర్యం ప్రకటించాడు నారాయణ.

(ఎల్లువ - పు : 170)

(35) రెటమతం - వ్యతిరేకంగా.

"ఏం పని జెయ్యాల్నో జెప్పు. ఇప్పుడే జేస్తాము అంటూ ఒకరికొకరు రెటమతంగా అడిగినాడు".

(మా వూరి దేవర - పు : 365)

## 5.2. జాతీయాలు

ప్రతి భాషలోనూ జాతీయాలకు ప్రత్యేక స్థానం వుంది. భాషా వ్యవహర్త అయిన ఆ భాషలోని జాతీయాలను ఒంట పట్టించుకొని, సమయానుకూలంగా ప్రయోగించినప్పుడే ఆ భాషలో రాణిస్తాడు. విడి విడి మాటల కలయికచే ఆ పదాలకు విడిగా లేని ఒక భాగాన్ని స్ఫురింపజేస్తాయి. ఇలా కొన్ని పదాల కలయిక ద్వారా సామూహిక అర్థాన్ని అందించే పదబంధాలను లేక పదసమూహాలను జాతీయం అనవచ్చు. ప్రత్యేకార్థక బోధకాలైన పదాలను కూడా జాతీయాలనవచ్చు.

జాతీయానికి చమత్కారం, నుడికారం, నుడికట్టు, పలుకుబడి అనే పర్యాయపదాలున్నాయి. ఆంగ్లంలో 'Idiom'హిందీలో 'ముహావర్' సమానార్థకాలు.

"సామాన్యంగా విడి విడిగా పొడి మాటలుగా ఉన్నప్పుడే అపూర్వ సమ్మేళనంలో ఆ మాటలకు విడివిడిగా దేనికో లేని ఏదో ఒక అపూర్వ భావ వ్యక్తీకరణకు మూలమై, విశిష్ట పదబంధాలుగా భాషలో నిలిచి పోతున్నాయి"[1]

"ఒంటరిగానున్న యొక పదములన కనబడని సొగసు, అది పదాంతంలో చేరి జత కట్టినపుడు ఇట్టే తళుక్కుమని తోచును. దానివలన ఆ సందర్భమునకే ఒక వింత సొబగు చేకూరెను. ఇవి పదబంధములు"[2]

కడప కథలోని కొన్ని జాతీయాలను ఇక్కడ పొందుపపరచడం జరిగింది.

(1) తలలోని నాలుక - ప్రధానమైనది, ముఖ్యమైనది.
"చిన్నపు రెడ్డి బతికి ఉండగా, ఆయన మూలంగా ఏ ప్రాణి ఇబ్బంది పడలేదు. గ్రామంలో అందరికీ తలలోని నాల్కలాగా మసలుకున్నాడు".
(పాడె - పు : 180)

(2) తడిగుడ్డతో గొంతుకోయు - నమ్మించి మోసం చేయు
"అనుకునేదేముంది? మీ బాస తడిగుడ్డతో గొంతు కోసే రకం బాస. మాది సూటిగా ఉంటాది".
(మనిషీ - పుశువూ - పు : 209)

(3) నిగనిగలాడు - మెరయు, తాజా, మంచి పక్వానికి వచ్చినవి.
"మూడొందలు లెక్కాపాయ. మూతి మీసాలు బాయె... అని ... చేతి చమురు విదిలిచ్చుని ... ఒకటో కిష్టుడి వేషం తుమ్మెద రెక్కల్లాగ నిగనిగలాడే మీసాలు కూడా తీసేసి మరీ రెడీ అయిన ఎంగట్రామయ్యయితే నోట మాట రాకుండా దిగాలు పడుతూ కూర్చున్నాడు".
(మచ్చ - పు : 265)

(4) అడియాశ - వ్యర్థమైన కోరిక
"రఫీ తీరా వెళ్ళబోతూ, భార్య దగ్గర ఆగాడు. భర్త తనని ఒక్కసారి కౌగిట్లోకి తీసుకుంటాడేమోనని ఆత్రంగా ఎదురు చూస్తోందామె. కానీ ఆమె ఆశ అడియాశే అయింది".
(మున్నీ బేగం - పు : 274)

(5) పెదవి విరుచు - అయిష్టత చూపు, ప్రయోజనం లేదని చెప్పుట.
"అడుక్కింత బోరు బండికి రేటు పెరిగిపోతోంది. కూలీలు, బోరు బండి యజమానితో సహా అందురూ పెదవి విరిచేశారు".
(జీపొచ్చింది - పు : 298)

(6) ముందు నుయ్యి, వెనుక గొయ్యి - ఎటువైపు పోలేని పరిస్థితి.
"ఎవసాయంలో బతుకు లేదు. బతకడం కోసం ఇంగొక పని ఏం జేయాలో అర్థం గాదు. తన పని ఇపుడు ముందునుయ్యి వెనుక గొయ్యి మాదిరి తయారైంది".
(జీవ సమాధి - పు : 321)

(7) నిత్య కళ్యాణం - పచ్చతోరణం - ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఉండటం.
"అత్తగారిల్లు నిత్యకళ్యాణం పచ్చ తోరణంలాగా ఎప్పుడూ పాడిపంటలు, పనిమనుషులతో కళకళలాడుతూ వూర్లోని సందడంతా ఆ లోగిలిలోనే ఉండేది".
(చీకటి సవ్వడి - పు : 328)

(8) బూడిదలో పోసిన పన్నీరు - వ్యర్థము.
"మొత్తం మీద సేన్లపైన పెట్టుబడిగా పెడ్తున్న లెక్కగాని, కష్టంగాని బూడిదలో పోసిన పన్నీరు మాదిరాయె".
(కరవురాగం - పు : 347)

(9) ఏకరువు పెట్టు - వివరంగా చెప్పు.
"నారాయణమ్మ చనిపోయిన సంగతి తెలిసి పుట్టింటి వారితో బాటు బంధువులందరూ వచ్చారు. అందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. పుట్టింట్లో ఆమె బతికిన తీరును ఏకరువు పెట్టారు".
(అంతరం - పు : 390)

(10) తలలు బద్దలు కొట్టుకొను - ఏమి చేయాలో పాలు పోక పోవడం
"హెడ్ మాష్టర్లంతా పరీక్షల నిర్వహణను మరింత కఠిన తరం చేయడంతో కొన్ని ప్రాంతాలలో కేవలం వీరిపైనే ఆశలు పెట్టుకున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, కాపీరాయుళ్లు ఏం చేయాలో పాలుపోక తలలు బద్దలు కొట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
(అడ్డ రోడ్డు - పు : 392)

(11) రెక్కలు ముక్కలు చేసికొను - శారీరక కష్టం చేయు.
"నాగమణి రెక్కలు ముక్కలు చేసుకొని రోజూ ఐదు, పది రూపాయలు సంపాదిస్తుంది.
(పొగ (రు) మంచు - పు : 413)

(12) దిగమింగుకొను - అణచుకొను
"బాబాయ్! నీ బిడ్డలు పెళ్ళికెదిగారా? అతన్ని పశ్నించాలని పెదాల పైకి వచ్చిన మాటల్ని బలవంతాన దిగమింగుకొని విసవిసా ఆ గదిలో నుంచి లోనికి వెళ్లిపోయాను".
(నీలవేణి - పు : 6)

(13) తాబేటి నడక- మెల్లిగా నడచుట.
'రైలు దిగి కడపు నిండుకూ గాలి పీల్చుకొని చావు బతుకుల్తో బయటపడి తాబేటి నడకలా మెల్లగా అటు ఇటూ తూలుతూ నడుస్తున్నాడు శ్రీనివాసులు".
(కాల చక్రం - పు : 15)

(14) తల దూర్చి - లీనమై పోయి
"రాత్రి సినిమా కథ మళ్ళీ జ్ఞాపక మొచ్చింది. రాత్రి తెగని ఆలోచనల్లో తల దూర్చి ఇంకా అలాగే పడుకొని ఉన్నాడు".
(సంస్కరణ - పు : 51)

(15) జెర్రులు పాకినట్లు - అసహ్యం (పుట్టుట) కలగడం.
" 'మళ్ళీ పెళ్ళి
ఆ మాట చెవిన పడితే నాకు వళ్లంతా జర్రులు ప్రాకినట్లుంటుంది. అమ్మతో చాలా సార్లు చెప్పాను. ఈ పెండ్లి సంబంధాలు తెచ్చే ఖాలాబీలను మన ఇంటికి రానేవద్దని".
(యంత్రం - పు : 111)

(16) కనుగూరికి - నిద్రలోకి జారుకొను.
"యవ్వారం ముగించి ఇంట్లోకెళ్లి మంచినీళ్లు తాగి దొడ్లోకి నడిచేసరికి మంచంమీ్మద కనుగూరికి వుంది ఇందిర".
(చనుబాలు - పు : 191)

(17) కావిలి గంతలు - నిరీక్షణ, కాపుకాచు
"అదేం కూలికి నాలికి వచ్చేదా? కావిలి గంతలుండేదా? రోజూ కూడు బెట్టి సాకుతాండ్రు" కోపంగా అన్నాను.
(చనుబాలు - పు : 191)

(18) పెదవికి మించిన పల్లు - నియంత్రణ లేని, అదుపు చేయలేని.
"నేను గుక్క తిప్పుకోలేకపోయాను. పెదవికి మించిన పల్లులాంటి పాత్రయీావిడ!"
(నీలవేణి - పు : 14)

(19) బెల్లం కొట్టిన రాయి - పని లేకుండా, పలకకుండా
"ఏం జెయ్యాల్లో నువ్వే సెప్పురా ఆదిగా వూరికే అట్ల నిలబడితే యెట్ల బెల్లం కొట్టిన రాయి మాదిరి".
(రాములవారి గుడి ముందు - పు : 67)

(20) పూస గుచ్చినట్లు - ఒక్కటి కూడా విడవకుండా చెప్పుట
"సావిత్రమ్మ ఏజంట్ల గుట్టునూ, దళారీతనాన్ని పూసగుచ్చినట్లు వివరించింది".
(కువైట్ సావిత్రమ్మ - పు : 145)

(21) నిమ్మకు నీరెత్తినట్టు - పట్టించుకోకుండా
"ధనియాలు నిమ్మకు నీరెత్తినట్టు నిలబడ్డాడు తప్ప ఉలకనూ లేదు పలకనూ లేదు".
(పాడె - పు : 186)

(22) పిల్ల యెవ్వారం - లోక అనుభవం లేని.
"వీళ్ళది కొంచెం పిల్లయెవారంగా వుంది అనిపించింది".
(మనిషీ - పశువూ - పు : 207)

(23) ఎగనామం - మోసగించు.
"మాకు పనికొచ్చే ప్రాజెక్టులకు మాతోనే ఎగనామం ఎట్టిచ్చి, మీకు అవసరమైనవి కట్టుకున్నారు".
(మనిషీ - పశువూ - పు : 210)

(24) కొంప మునుగు - సర్వం పోగొట్టుకొను.
" మధ్యలో ఎవరికీ సమ్మందంలేని సన్నా, సపకా, బీదా బిక్కీ గాల్లు పానాలు చేతల్లో పెట్టుకుని ఎప్పుడేం కొంప మునుగుతాదో అని వణికిసచ్చే పనైపాయ".
(మచ్చ - పు : 267)

(25) గుండె జారిపోయింది - నిశ్చేష్టుడవడం.
"వెంకట్రెడ్డికి మొదట అర్థం కాలేదు. అర్థం అయ్యాక గుండె జారిపోయింది".
(జీపొచ్చింది - పు : 296)

(26) చిలక్కి జెప్పినట్టు - చాలా సార్లు చెప్పటం.
"ఈని తాతలెక్కటోంతో నీకు పెళ్లి సెయిపిచ్చా... రమ్మని చిలక్కి జెప్పినట్టు చెప్పినాడు. ఆయమ్మి ఇనిపిచ్చుకోలా!".
(మచ్చ - పు : 270)

## 5.3. సామెతలు

'సామెత లేని మాట - ఆమెత లేని ఇల్లు' అని తెలుగు సామెత చెబుతుంది. ప్రజల్లో విజ్ఞాన, వికాసాన్ని విషయ అవగాహనను అందించడంలో సామెతల పాత్ర ఎంతో ఉంది. సామెతలు జనజీవితంలో ఒక భాగం. అవతలవాడు తనను గూర్చి ఏమనుకుంటున్నాడో అని తన అభిప్రాయాన్ని సూటిగా, స్పష్టంగా, ఘాటుగా

చెప్పలేక పోతాడు. అలాంటి సమయాల్లో తన భావానికి తగ్గ సామెతని ఎన్నుకొని పరోక్షంగా పోల్చి చెప్తాడు. సరైన సామెత గుర్తుకు రాకపోతే' అదేదో సామెత చెప్పినట్లుంది' అని ప్రయోగిస్తారు.

"సంభాషణలో మనం చెప్పే విషయాన్ని స్పష్టం చేయడానికి ఆ విషయాన్ని పోలిన మరో విషయం చెప్తాం. అదే సామెత. చెప్పదలచుకున్న భావాల్ని సంక్షిప్తంగా, సూటిగా, శ్రోత మనస్సుకు హత్తుకునేటట్టు చెప్పడంలో సామెతకు సాటియైనది మరొకటి లేదు. శ్రోతల అభిప్రాయాన్ని ఖండించడానికి గానీ, బలపరచడానికి గానీ వక్త సామెతల్ని ఉపయోగించవచ్చు"[3]

"సామెత అనగా ఒక వ్యవహారక్షుణ్ణమైన ఉక్తి"[4] అని శ్రీసంపత్ రాఘవాచారి నిర్వచనం.

"ఒక పిండితార్థాన్ని కొద్ది మాటల్లో చెబుతుంది సామెత"[5] అని 'విశ్వనాథ సత్యనారాయణ' నిర్వచనం.

కడప కథ సంకలనంలోని కొన్ని సామెతల్ని ఇక్కడ పొందుపరచడం జరిగింది.

(1) "ముగ్గురాడవాళ్లు కలిస్తే ముల్లోకాలకూ నిప్పు ముట్టిస్తారనుకో"

ముగ్గురు ఆడవాళ్లు కలిస్తే లేని పోని గొడవలు సృష్టిస్తారని దానర్థం - ఆ సందర్భంలో ఈ సామెత వాడతారు.

"మీ కమలక్క అక్కడికి పోవడమూ, అన్నీ కలిసి నిష్కారణంగా ఆ అమ్మాయి మీద నింద వేయడానికి అక్కరకొచ్చినాయి. 'ముగ్గురాడవాళ్ళు కలిస్తే ముల్లోకాలకు నిప్పు ముట్టిస్తారనుకో'. పాపం. అక్కడ పెళ్లి కూతురు సుబ్బరామయ్య భార్యతో కలిసి అప్పుడే ఇంటికి వచ్చింది.

(నీతిగానుగ - పు : 42)

(2) "ఎదిగిన పిల్ల యింట్లో వుంటే ఎదాన కుంపటి ఉన్నట్లే".

రజస్వలై, వయస్సులో ఉన్న ఆడపిల్లకు పెళ్లిగాకుండా ఇంట్లే ఉండే, ఆ అమ్మాయి తల్లిదండ్రుల గుండెలమీద కుంపటి ఉన్నదానితో సమానము.

"ఏమీ కాబట్టదు. తినడమూ తోటకాడికో దొడ్డికాడికో పోవడమూ పిల్ల సంగతి ఎత్తుకోవా" అని అంటూ ఉంటారు. "ఎదిగిన పిల్లది యింట్లో వుంటే ఎదాన కుంపటి వున్నట్లే" అని కూడా పోరు పెడ్తారు. డబ్బు లేకా, సరైన సంబంధం దొరక్కా కాలం దొర్లిస్తున్నాడు రామయ్య.

(దొంగబర్రెగొడ్లు - పు : 80)

(3) "పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం".

**ఒకరికి తమాషాగా, ఆనందంగా ఉంటుంది. అదే విషయం లేదా అంశం మరొకరికి ప్రాణాపాయానికి కారణమౌతుంటుంది - అని ఈ సామెతకు అర్థం.**

తన భార్య వసుధ పుట్టింటికి వెళ్లిన తరువాత ఆమె విలువను గుర్తించిన శ్రీనివాస్ అన్న మాటలివి. "అమ్మా నాన్నకు ఏలోటూ రాకుండా చూస్తూ వచ్చింది. పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటమంటే ఇదే కాబోలు. ఈ కాలంలో ఎంతమంది వసుధ లాంటి వారుంటారు".

(ఆ ముగ్గురూ! - పు : 263)

(4) "ఊర్లో సంబరమైతే రంకు ముండకు సంగటి దిగదంట".

ఊర్లో వేడుకలు జరిగితే ఆ రోజు విందు భోజనాలుంటాయి. రోజూ రాగి సంకటి తినే రంకు ఆడదానికి ఆ రోజు రాగి సంకటి రుచించదు. విందు భోజనం కావాలంటుంది.

"కూడేమైనా దొరికిందా?" అని 'పులి' అడిగేసరికి ఈ లోకంలోకి వచ్చినాను.

'లే' అని మాత్తరం అన్యా.

"ఊర్లో సంబరమైతే రంకుముండకు రాగి సంకటి దిగదంట" అని సామెత చెప్పినాడు. సెప్తే ఇన్యావ్? లేని పోని పాపాలు జేసి ఇప్పుడే జన్మ నెత్తినాం. మళ్లా ఆ పాపపు కూడెందుకు? నాది నాది అని పరిగెత్తుతావ్ ... ఇంగా నీదేముండాది ఆడ"?

(సింహము - కుక్క - పులి - పు : 356)

(5) "కోడలు వచ్చిన వేళ, కోడె వచ్చిన వేళ".

ఇంటికి కోడలు వస్తే శుభం జరుగుతుంది. అదే విధంగా కోడె వస్తే వ్యవసాయం బాగా ఫలిస్తుంది. ఈ రెండు శుభానికి సంకేతంగా చెప్తూ ఈ సామెతను

వాడ్తారు. "కోడలు వచ్చిన వేళ, కోడె వచ్చిన వేళ" అంటారు. కొత్త కోడలు నట్టింట కాలి పట్టెల మువ్వలతో కొత్త కోడె గాడిపట్టున గంటలతో గల్లు గల్లున తిరుగుతుంటే ఇంట ధనలక్ష్మి, పొలంలో ధాన్యలక్ష్మి స్థిరపడిపోతుందంటారు.

(యంగముని వ్యవసాయం - పు : 409)

(6) "పోలు బొందులేని మాటల్తో పొద్దుబుచ్చుకుంటే".

గ్రామాలలో సాయంత్ర వేళ భోజనం తర్వాత గ్రామ ప్రజలు కూర్చొని కాలక్షేపం కోసం ఏవో కొన్ని వారికి ఉపయోగపడని విషయాలు మాట్లాడుకుంటారు. అలా మాట్లాడుకునే సందర్భంలో ఆ ఊరి పెద్దలు గానీ వారి ఇంటి యజమానులు గానీ సమయాన్ని ఎందుకు వృథా చేసుకుంటారు అనే సందర్భంలో ఈ సామెతను వాడ్తారు.

"లేచి అలవాటుగా అరుగు వద్ద కెల్తోంటే మంచమ్మీంచి నాన్న అన్నాడు. రొవ్వంత సేపు పురాణం సదివి చెబితే ఏమబ్బీ! ఆ పోలుబొందులేని మాటల్తో పొద్దుబుచ్చుకుంటే" అని.

నేను విన్పించుకోనట్టుగా వెళ్లి అరుగు మీద కూచున్నాను.

(చనుబాలు - పు : 190)

(7) " కూరకు వాడుకొని పారవేసిన కరివేపాకు".

'అవసరానికి ఉపయోగించుకుని పారేయటం' ఈ సామెతకు అర్థం.

"కనీసం నా అనుభవాలు, సలహాలు కూడా వారికి పనికి రావు. అసలు రుచించవు కూడా. 'కూరకు వాడుకొని పారవేసిన కరివేపాకు నేను'. మర్యాదగా ఓమూలకు నెట్టేశారు".

(ఈ గుండె కరగదు - పు : 121)

(8) "తాటి కింద పాలు తాగిన చందాన".

'పరిసర ప్రభావం వలన పొరపాటు పడటం' - అనే సందర్భంలో ఈ సామెతను వాడతారు.

"ఆ దానిదేముంది? తెలియనపుడు ఎవరైనా పొరబడుతారు. అంటారే 'తాటి కింద పాలు తాగిన చందాన'. ఇదీ ఆ చందమే! అని నవ్వుతూ 'రండి మరి - చీకటి పడుతూంది' అంటూ ముందుకు సాగింది".

(ఈ గుండె కరగదు - పు : 125)

(9) "పేదవానికి పెళ్ళామే పెన్నిది".

'పేదవానికి భార్యే గొప్ప నిక్షేపం'తో సమానమనే సందర్భంలో ఈ సామెతని వాడతారు. "పేదవానికి పెళ్ళామే పెన్నిది. అన్నది ఒక సూక్తి. కానీ ముసలితనంలో మగవానికి భార్య తోడు మరీ అవసరం. అదే ఆలోచిస్తూ కూర్చున్నా" అన్నాను ఆమెతో.

(ఈ గుండె కరగదు - పు : 127)

(10) "రౌతు మెత్తనయితే గుఱ్ఱం మూడుకాళ్ళ నడుస్తుంది".

"యజమాని చేతగానివాడైతే పని వాళ్ళు మాట వినరు" అనే సందర్భాన వాడతారు. 'రౌతు మెత్తనయితే గుఱ్ఱం మూడుకాళ్ళ నడుస్తుంది' చేటు కాలం వచ్చి పడింది. పని బాట లేక వాళ్ళకు కళ్ళు నెత్తిమీదికి వచ్చాయి. నిన్నూ నన్ను ఎవర్నీ లెక్క చెయ్యడం లేదు. మనమే వాళ్ళని పైకెత్తుతున్నాం. చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత - అనుభవించక తప్పదు. వెళ్ళిరండి" అంటూ విసవిసా ముందుకు దాటుకొని వెళ్ళాడు.

(పాడె - పు : 184)

(11) "కాపోనికి కండ్లముందరే గొడ్లుండాల"

'రైతు ఎప్పుడూ ఎనుములూ ఎద్దులునూ గమనిస్తూ వుండాలి' అనే సందర్భంలో ఈ సామెతని ఉపయోగిస్తారు.

"కాపోనికి కండ్లముందరే గొండ్లుండాల" అనే మాట తమ తండ్రి నుంచీ విన్నాడు ఆయన.

(మనిషీ - పశువూ - పు : 215)

(12) "అత్తమింద కోపం దుత్తమింద చూపించటం"

'ఒకరిపై వున్న కోపాన్ని మరొకరి పై వ్యక్తం చేసే సందర్భం'.

"నా మొగానికి సరసం గూడానా? దుడ్లు పొయ్యి నేనేడుస్తుంటే" గయ్యిమంది ఎంకి. 'అత్తమింద కోపం దుత్తమింద సూపిస్తావేమే సుప్పనాతీ?' నీ మొగుడు దిన్నమూ గవర్నమెంటు సారాయి తాగేవాడో. ఈ పొద్దు మాటేల నాటు సారాయి పీకల్దాకా తాగుతుండె. ఇసి పెట్టాకులు జోరుగా ఆడతావుండె".

(అబల - పు : 342)

## 5.4. జంట పదాలు

జాతీయాలు సామెతల్లాగా జంటపదాలు కూడా కథను చదివిస్తాయి. కథా రచనలోని రమణీయకతను ప్రతిబింబిస్తాయి. కడప కథా సంకలనంలోని జంట పదాలను మనం ఇక్కడ చూడవచ్చు.

(1) డక్కా మొక్కీలు.
"ఇరవై రెండేళ్ళ సీతాపతి జీవితంలో ఇంకా ఏ విధమైన డక్కా మొక్కీలు తినలేదు".
(సంస్కరణ - పు:50)

(2) అన్నం గిన్నం.
"అవ్వ పూల గంప నెత్తికెత్తుకుని వెళ్ళిపోయే ప్రయత్నంలో ఉంది అన్నం గిన్నం అడగనే లేదు, తిరిగి నాకు ఛుర్రుమంది".
(ప్రేమ - పు : 62)

(3) కాళ్లా వేళ్లా పడు.
"వీళ్లెక్కడ ఇస్తారబ్బా మళ్లీ మన డబ్బు! కాళ్లా వేళ్ళా పడి పని జరుపుకుంటారు".
(జవాబులేని ప్రశ్న - పు : 74)

(4) అటూ ఇటూ.
"మా ఇంటి ఆవలి సందులో వుంది కాన్వెంట్. పక్కకు కదలి అటూ ఇటూ పోతే వెళ్ళిపోతారేమోనని భయం".
(యంత్రం - పు : 115)

(5) ఉలకనూ లేదు పలకనూ లేదు.
"ధనియాలు నిమ్మకు నీరెత్తినట్లు నిలబడ్డాడు తప్ప ఉలకనూ లేదు పలకనూ లేదు".
(పాడె - పు : 186)

(6) స్థితి గతి.

"మా వూరి మాలల స్థితిగతుల్ని గురించీ, వూర్లో వాళ్ల స్థానాన్ని గురించి - నా హైదరాబాదు మిత్రుడికి రాసిన లేఖకు సమాధానం వచ్చింది".

(చనుబాలు - పు : 200)

(7) ఉలుకు పలుకు

"ఏమయ్యా పంతులూ, ఏదో చిన్న సహాయం చేయమని అడిగితే ఉలుకు, పలుకూ లేకుండా ఉండి పోయావు" రెట్టించి అడిగాడు ఎమ్మెల్యే.

(అడ్డ రోడ్డు - పు : 393)

(8) తోడు జోడు.

"తోడు జోడు లేకుండా యెంత కాలమని బ్రతికేది"

(ఈ గుండె కరగదు - పు : 126)

(9) కన్నీరు మున్నీరు.

"రామలక్ష్మమ్మ కన్నీరు మున్నీరుగా ఏడ్చింది".

(కువైట్ సావిత్రమ్మ - పు : 147)

(10) అడపా తడపా

" ఇద్దరమూ ఉద్యోగం చేస్తున్నాం. అడపా తడపా మా తండ్రి గారి కుటుంబాన్ని కూడా నేను ఆదుకుంటూ వుంటాను".

(నీలవేణి - పు : 13)

(11) చిందర వందర.

"శ్రీనివాసులు మూడు నెలల అద్దె చెల్లించాలి. యజమాని కర్ణకఠోరంగా మాట్లాడుతున్నాడు. కేకలేస్తూ చిందర వందరగా ఎగిరి గంతులేశాడు. శ్రీనివాసులు ఏమి మాట్లాడలేక మౌనం వహించాడు".

(కాలచక్రం - పు : 17)

(12) కుయ్యి కయ్యి

"యెన్ని పనులు కల్పించినా వోబిగాడు కుయ్యి కయ్యి మనకుండా చేస్తూనే వుంటాడు".

(ఓబిగాడు - పు : 89)

(13) దిక్కూ తెన్నూ

"గేటు వద్ద ప్రయాణీకుల సమూహం గేటంతా ఆక్రమించుకుంది. ఆ గుంపులో నుంచి ఆర్తనాదం దిక్కూ తెన్నూ తెలియని సుడిగుండంలో తగులుకొన్నట్లు 'నన్ను రక్షించండి! చంపవద్దు' అనే అరుపులు విన్పిస్తున్నాయి".

(కాలచక్రం - పు : 15)

(14) ఆదరాబాదరా.

" నా అవస్థ బస్సుక్కూడా తెలిసిపోయినట్లుంది. గంట ఆలశ్యంగా వూరు చేరింది. ఆదరా బాదరా బస్సు దిగుతుండగానే మా అన్నయ్య - నా కోసమే కాచుక్కూచ్చున్నాడులా వుంది - యెదురొచ్చాడు".

(ఓబిగాడు - పు : 92)

(15) అయిసా పయిసా

"షేర్లాకు హెూమ్స్యునూ, పెర్రీమాసర్‌నూ అప్పుడే ఫలహారం చేసి వచ్చిన వాడులా వున్నాడు. వొకటీ, రెండూ క్షణాల క్రిందటే మానవాతీతమైన సత్యాన్ని తానొక్కడే కనిపెట్టిన వాడులా వున్నాడు. దాన్ని గుర్తించని వాడితో నిష్పూచీగా తలపడి అయిసా పయిసా తేల్చుకునే వాడిలా వున్నాడు".

(ఓబిగాడు - పు : 97)

(16) పనీపాట - ఏ పని.

"పుల్లలు పెట్టేవాళ్ళు ఊర్లోనే తయారైనారు. పనీపాట లేక దొరికితే ఏరక తిందామని ఆ పక్కా ఈ పక్కా కోపు దొక్కేవాళ్ళు రాజకీయాలోళ్ళు అయిపోయిరి.

(కూలిన బరుజు - పు : 103)

(17) అంతూ పొంతూ

"సంబంధాలు పొడిగించడానికి వాళ్ళు చేప్పే అబద్ధాలకు అంతూ పొంతూ ఉండదు. ప్రస్తుతం ఈ పని చాలా లాభసాటి వ్యాపారంగా చెలామణి అవుతూంది.

(యంత్రం - పు : 112)

(18) అరా కొరా.

"దగ్గు దెబ్బకు తల దిమ్మెక్కి కణతల్లో పోటు. ఉన్ని శాలువ చెంపలకూ, మెడకూ గట్టిగా చుట్టుకున్నా అపుడపుడూ అరాకొరా పక్షుల రెక్కల చప్పుడు వింటూ కళ్ళు మూసుకొని కూచున్నా".

(ఈ గుండె కరగదు - పు : 119)

(19) చీకూచింతా.

"మొగుడు లేడు. అమ్మా, నాన్న ఆధారం కూడా లేని అనాథ. ఇద్దరు చిన్నబిడ్డలు. ప్రాయంలో ఉంది. దిక్కులేని ఆడదైనా, లక్ష్మి ముఖంలో ఎన్నడూ చీకూ చింతా కనబడదు".

(ఈ గుండె కరగదు - పు : 123)

(20) లబోదిబో.

"ఇదేం అన్యాయం! తను సాగు చేస్తున్న భూమి గవర్నమెంటు పోరంబోకు కాదు. తాత తండ్రుల నుంచి తనకు సంక్రమించింది. లబోదిబోమంటూ అతనా ఆర్డరు పట్టుకుని ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్ళాడు".

(ఎల్లువ - పు : 172)

(21) అస్తులూ పస్తులూ.

**"వాడలో బీదా బిక్కీ తిండిగింజలకోసం నానా యాతనా పడేవారు. ఊర్లోని రైతుల చుట్టూ మూగేవారు. వాళ్ళు అస్తులూ పస్తులూ పడకుండా రైతు ఆదుకునేవాడు".**

(పాడె - పు : 183)

(22) ఉక్కిరి బిక్కిరి.

"రవీంద్రారెడ్డితో తన పెళ్ళయిపోయింది. పార్టీలో మునిగి తేలుతున్న కుటుంబం ... ఆత్మీయతలకు మాత్రం కొదవలేదు. చదువుకున్న వాళ్ళలో అభివృద్ధి చెందిన ప్రాంతంలో లేని ఆపేక్షలు ... తనను ఉక్కిరి బిక్కిరి చేసేవి".

(చుక్క పొడిచింది - పు : 238)

(23) కొడీ ముడీ.

"కొత్త జీవితంలోకి ఒంటరిగా పోతున్నందుకు ఆందోళన ... అన్నీ కలగలిసి మనసూ, శరీరాలను ఉద్విగ్నతకు లోను చేస్తున్నాయి.
ఏవేవో కొడీ - ముడీ లేని ఆలోచనలొస్తున్నాయి".
(చుక్క పొడిచింది - పు : 244)

(24) అవాకులు చవాకులు.

"అర్థరాత్రి దాటింది మత్తులో సురేష్ అవాకులు చవాకులు పేలుతూనే వున్నాడు. ఎందుకేడుస్తావే? ఏమైందీ ... అప్పులోళ్ళొస్తే ... రానీ .... మళ్ళీ కువైట్‌కు పోయి సంపాయిస్తే సరిపోయే".
(చీకటి సవ్వడి - పు : 333)

(25) ఆర్సేవాళ్ళా తీర్సేవాళ్ళా.

"నా బాధ సెప్పుకుంటే మాత్తరం తీరుతుందా, మీరేం జేచ్చారయ్యా ఆర్సేవాళ్ళా తీర్సేవాళ్ళా ... అన్నాడు నిర్వికారంగా"
(గాయం - పు : 403)

(26) బదులు సదుళ్ళు.

"ఒంటరిగా ఉన్నప్పుడు యంగముని కొత్తూరు రెడ్డింటగాసగాడు. ఎప్పుడూ బదులు సదుళ్ళకు, సలహా సంప్రదింపులకు రెడ్డిని ఆశ్రయిస్తుంటాడు".
(యంగముని వ్యవసాయం - పు : 407)

(27) ఇంటా వంటా.

"తాకట్టు లేకుండా అప్పు ఇవ్వడం మా ఇంటా వంటా లేదు".
(పొగ (రు) మంచు - పు : 416)

## 5.5. ధ్వన్యనుకరణ శబ్దాలు

తెలుగు భాషలో కొన్ని శబ్దాలు ధ్వనిని బట్టి ఏర్పడతాయి. ఆ విధంగా ఏర్పడే శబ్దాలను ధ్వన్యనుకరణ శబ్దాలంటారు. అవి భాషకు సందర్భరీత్యా, అర్థ రీత్యా ఎంతో నిండుదనాన్ని చేకూరుస్తాయి. కడప కథాసంకలనంలోని ధ్వన్యనుకరణ శబ్దాలను ఇక్కడ ఇవ్వడం జరిగింది.

(1) విసవిసా.
"బలవంతాన దిగ మ్రింగుకొని విసవిసా ఆ గదిలో నుంచి లోనికి వెళ్ళిపోయాను"
(నీలవేణి - పు : 6)

(2) దడ దడ
"గుండెలు దడ దడలాడుతున్నాయి".
(కాలచక్రం - పు : 16)

(3) గబ గబ
"అక్కడ్నించి బయటకొచ్చి గబగబ నడక సాగించాడు".
(సంస్కరణ - పు : 56)

(4) టప టప
"బాధగా తలొంచుకునేసరికి కళ్లనీళ్లు టపటప రాలాయి"
(రాములవారి గుడి ముందు - పు : 71)

(5) చక చక
"చక చక కుల పెద్దలంతా గుమిగూడినారు".
(యంత్రం - పు : 114)

(6) జర జర
"దోస పండ్లతో ఉన్న ఆ సంచి ఏదో మంత్ర శక్తితో జర జర సాగి పోతోంది.
(అలికిడి -పు : 232)

(7) రెప రెప

"మున్నీ బేగం గుండె గాయపడిన పావురం రెక్కల్లా రెపరెపలాడింది".

(మున్నీ బేగం - పు : 274)

(8) బెక బెక

"అమ్మో! కప్పలు ... బెక బెక ... బెక బెక ... బాయిలో తన్నుంక లేదు".

(అబల - పు : 343)

(9) కిల కిల

"పక్షులు కిలకిలా రావాలు చేస్తున్నాయి".

(మార్జాలోపాఖ్యానం - పు : 224).

(10) కొరకొరా

"అమ్మ కొరకొరా చూచింది నన్ను".

(నీలవేణి - పు : 7)

(11) చరచరా

"నిన్ను రైలెక్కిస్తా! మీ అమ్మగారిల్లు చేరుకో! నేను ఏ రైలు కిందనో తలపెట్టేస్తాను. సమస్య తీరిపోతుంది. తారాపథాన్నందుకున్న కోపంతో అన్నమాటలవి. చరచరా నడిచి వీధిలో పడినాడు".

(కాలచక్రం - పు : 18)

(12) సలసల

"తలుపు తీసి చూసిన నిరంజనం, తలుపు దగ్గర కుప్పలా కూలిపోయి వున్న సీతాపతిని లోనికి తీసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టాడు. వొళ్ళు సలసల కాగిపోతోంది".

(సంస్కరణ - పు : 56)

(13) మటమట

"మా రామూగాడికి పుట్టుకతో నా పోలికయితే వచ్చినాయి గానీ విధి విరామం లేని మా అత్తగారి పెంపకంలో ఆమెలాగే మటమటలాడే మొహమూ, వొక్క డబ్బును తప్ప దేన్నీ గుర్తించలేని దృక్పథమూ, వొక్క తిండిని తప్ప దేన్నీ ప్రేమించలేని లౌక్యమూ అబ్బినాయి".

(ఓబిగాడు - పు : 90)

(14) పకపకా

"నీలవేణి పకపకా నవ్వింది. ప్రవాహస దృశ్యంగా నవ్వింది".

(నీలవేణి - పు : 14)

(15) ఖణేల్ ఖణేల్

'బురుజు చుట్టూ కట్టిన అరుగు మీద పడుకొన్న ముసలాయన నన్ను చూసి లేచి కూర్చున్నాడు - ఖణేల్ ఖణేల్మని దగ్గుతూ, దగ్గు ఆపి ఆయాసంతో 'ఎవరింటికి'? అన్నాడు".

(కూలిన బురుజు - పు : 100)

(16) ముసి ముసి

"ఎంత పొర్లినా నిద్ర రావడం లేదు. ఏవేవో ఆలోచనలు మనసును ముసురుకొంటున్నాయి. అప్పుడయితే రిజ్వానా నిద్రముందు చాలా గొడవ చేసేది. నా యెద మీద కూర్చొని ముసిముసిగా నవ్వేది. వచ్చీరాని మాటలతో అమ్మా! అమ్మా! అని నా బుగ్గలకేసి గుద్దేది. అంతలోనే పకపకా నవ్వుతూ ముఖమంతా ముద్దులు పెట్టేది".

(యంత్రం - పు : 113)

(17) గుసగుస

"ఇద్దరి సంబంధాలు ఈ మహాతల్లే కుదిర్చింది. ఆ పరిచయం వల్ల వస్తూందనుకొన్నాను మొదట్లో. కాని అమ్మతో గుసగుసలాడుతూంటే విన్నాను, నాకు మళ్ళీ పెళ్ళి చేస్తే బాగుంటుందని".

(యంత్రం - పు : 112)

(18) విలవిల

"అబ్బాజాన్! మూర్ఖులకు భార్యలైన నా వంటివాళ్ళకు ఈ బాధలు తప్పవు. ఈ ముళ్ళకంచెలో యిరుక్కుని విలవిలలాడుతున్న సోదరీమణులకు చేయూతనివ్వాలనుకున్నాను".

(యంత్రం - పు : 117)

(19) బిరబిరా

"మగవాడయిన దోషం నలుగురికీ నా ఏడుపు కనిపిస్తుందని మొగం చాటు చేసుకొని బిరబిరా పార్కు దిక్కుగా దూసుకెళ్ళాను".

(ఈ గుండె కరగదు - పు : 128)

(20) దబదబా

"నారాయణ గుండె దబ దబా బాదుకున్నాడు. నా ఉసురు తగుల్తాది కరణమయ్యా, ఇంగా తగుల్తాడి. ఇంగా తగుల్తాది".

(ఎల్లువ - పు : 176)

(21) నిగనిగ

"మూడొందలు లెక్కాపాయ.... మూతి మీసాలు బాయో అని .... చేతి చమురు వదిలిచ్చుకుని ... ఒకటో కిష్టుడి వేషం కోసం తుమ్మెద రెక్కల్లాగా నిగనిగలాడే మీసాలు కూడా తీసేసి మరీ రెడీ అయిన ఎంగట్రామయ్యయితే నోటమాటరాకుండా దిగాలు పడ్తూ కూర్చున్నాడు".

(మచ్చ - పు : 266)

(22) పలపల

"అప్పుడైతే సినుకులు గినుకుల్లేకుండా వాతావరణం తేటగా వుంటది. జనం గూడ పనీబాట ల్యాక తీరిగ్గా వుంటరు. పంటసేతికొచ్చి జోబుల్లో నాల్గురూపాయలు పలపల మంటుంటాయి".

(జీవసమాధి - పు : 316)

(23) బిక్కు బిక్కు

"దిక్కులేని పక్షుల్లా బిక్కు బిక్కుమంటూ ధైన్యంగా బతుకుతున్న బిడ్డలను చూసి రాజ్యలక్ష్మి గుండెలవిసిపోయాయి".

(చీకటి సవ్వడి - పు : 332)

(24) బరబర - బిర బిర

" ఆ మాటకు కోడలు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బర బర ఇంట్లోకి పోయి బిరబిర బయటకు వచ్చింది. లక్షుమ్మ చెయ్యిపట్టుకుని ఇంట్లోకి ఈడ్చుకుని వెళ్లింది".

(అంతరం - పు : 382)

(25) పిసపిసా

"ముఖం కడుక్కోని ఇంట్లోకి వచ్చింది నారాయణమ్మ. ఎక్కడా పరమాన్నం గానీ, అన్నం కానీ కనపడలేదు. రాత్రి అన్నం వండిన కుండేవుంది. దాంట్లో చూస్తే నీళ్ళు పోసిన సద్దిబువ్వ వుంది. అదే రొవ్వంత తెల్లెలో పెట్టుకుని సపారంలోకి వచ్చి కూర్చొని తిందామని తెల్లెలో చెయ్యిపెట్టింది. అన్నం పిసపిసా అంటూ ... పాసిపోయినట్లనిపించింది. రొవన్ని మెతుకులు నోట్లో పెట్టుకుంది".

(అంతరం - పు : 382)

(26) వలవలా.

"కోడలు అరుపులతో వీధిలోని ఆడమ్మగారంతా తోడయ్యారు. అందరినీ పిలిచి చేతులు పట్టుకుని లాక్కెళ్లి పరమాన్నం, బువ్వ చూపించి తనను కావాలనే ముసల్ది అల్లరి పట్టించిందని వల వలా ఏడ్చింది".

(అంతరం - పు : 383)

(27) దభ దభ.

"కొత్త సొక్కా వేసుకుని పండగ జేసుకున్నెవని దాని కండ్లు కుట్టినయి. నువ్వు సచ్చింటే దాని కండ్లు సల్లబడు - అంటూ కూతుర్ని దభ దభ బాదుతూ సోకనార్థాలు పెట్టింది లక్ష్మిదేవి".

(అంతరం - పు : 383)

(28) టక టక.

" దారినపోయే దానమ్మ నొసటి మీద నుంచి చేయి తీసి, చేతి కఱ్ఱ టకటకలాడించుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.

(పొగ(రు) మంచు - పు : 419)

## 5.6. సాదృశ్యాలు

'కడప కథ' సంకలనంలోని కథల్లో రచనా రమణీయకతను పోషిస్తూ రచయితలు కొన్ని సాదృశ్యాలను వాడారు. ఇవి హృదయానికి హత్తుకునేటట్లు అతి మనోహరంగా ఉండి కథను వేగవంతంగా చదివిస్తాయి. కడప కథ సంకలనంలోని సాదృశ్యాలు కొన్నింటిని ఇక్కడ రాయడం జరిగింది.

(1) "జీవితంలో అప్పుడే ఓడిపోయిన వాడిలా బెదిరి పోయిన గొడ్డులాగున్నాడు".
(నీలవేణి - పు : 7)

(2) "రైలు దిగి కడుపు నిండుకూ గాలి పీల్చుకొని చావు బతుకుల్లో బయటపడి తాబేటి నడకలా మెల్లగా అటూ ఇటూ తూలుతూ నడుస్తున్నాడు. శ్రీనివాసులు".
(కాలచక్రం - పు : 15)

(3) "ఓబిగాని లాంటి నవ్వు, ఆరోగ్యం, గాంభీర్యం నా కొడుక్కు అబ్బకుండా చేస్తోన్న మా అత్తగారంటే యెత్తుడు కారం కళ్ళలో యెత్తినంత మంట".
(ఓబిగాడు - పు : 90)

(4) 'రెండు మూడు గొర్రెలను' నాలుగైదు పొట్టేండ్లను పట్టికొట్టి సంపి దాన్ల వచ్చిన రకతం ఎగబీల్చి తాగి, గట్టి గట్టి కండలను పీల్చి దిగమింగి నీల్ల కుంటలో కైపెక్కి సల్లింగ పండుకున్న పెద్ద పులి మాదిరుండాడు సుబ్బారెడ్డి".
(తొందరపడి ఒక కోడి ముందే కూసింది - పు : 134)

(5) "ఒళ్లంతా మట్టి పేరుకొని పుళ్ల శరీరంతో, అస్థి పంజరంలా ఉన్నాడు పొట్టక్క కొడుకు".
(చనుబాలు - పు : 199)

(6) "ఊరు ఊరంతా పీనిగె లేచిన యింటి మాదిరుంది"
(చుక్క పొడిచింది - పు : 235)

(7) "నాన్న వేధింపులతో శారీరకంగా, మానసికంగా అరగదీసిన గంధపు చెక్కలా అయిపోయిన అమ్మను చూస్తే జాలనిపిస్తోంది".
(కుక్కకు కోపమొచ్చింది - పు : 256)

(8) "ఇప్పుడు నా మనసు తుఫాను వెలసిన సముద్రంలా ప్రశాంతంగా ఉంది".
(ఆ ముగ్గురూ - పు 263)

(9) "కోడి మాంసం తిని తిని దున్నపోతులా బలిసి తల మీద వెంట్రుకలన్నీ వూడిపోయి వికారంగా కనిపిస్తున్న భర్తనే చూస్తుండిపోయింది".
(మున్నీబేగం - పు : 276)

(10) "తనకు నీతిని జాగర్తను బోధించిన తన కొడుకును నల్లటి మేఘం కప్పేసినట్లు రాహువు మింగేసినట్లు అనిపించింది".
(చంద్రగ్రహణం - పు : 285)

(11) "నూనె దీపాల వెలుతురులో తెరపై విగ్రహాలు రంగు రంగుల్లో మెరుస్తూ స్వర్ణకాంతులను వెదజల్లుతున్నాయి".
(కడుపాత్రం - పు : 294)

(12) "దొంగ పూత కొచ్చిన శెనిక్కాయ చెట్లు మెలిగుండ్లేసుకుంటున్నాయి"
(జీపొచ్చింది -పు : 295)

(13) "గన్నేరు సెట్టు మత్తుగా పూల మొగ్గల్ని ప్రసవిస్తా ఉంది".
(శిలబండి - పు : 305)

(14) "ఆలోసెన నిద్దర్ని పురుగులా తొలిసేచ్చాంది.
(జీవ సమాధి - పు : 315)

(15) "బంగారానికి తావి అబ్బినట్లు సురేష్‌కు అందచందాల రాశి రాజ్యలక్ష్మి భార్యగా దొరికింది".
(చీకటి సవ్వడి - పు : 328)

(16) "కడపు చించుకుంటే కాళ్లమీద పడ్తాదని కరువును తల్చుకుంటే మనసంతా పాడైతాది".
(కరవురాగం - పు : 347)

(17) "ఇంట్లో అడుగు పెడుతూనే బాంబులాంటి వార్త వినాల్సొస్తుందని అనుకోలేదతను".
(కాసింత నీడ -పు : 368)

(18) "కన్న కొడుకు ముఖాన ఉమ్మివేయడంతో నారాయణమ్మ ప్రాణం సచ్చిపోయింది".
(అంతరం - పు : 384)

(19) పరీక్ష మాట వినపడగానే గుండెల్లో రాయిపడినట్లయింది రామకృష్ణకు".
(అడ్డరోడ్డు - పు:393)

(20) "ఒళ్లంతా దెబ్బలతో కుడుములు కట్టింది".
(గాయం - పు : 402)

(21) "యంగముని కాలిముళ్ళు సావిత్రి గుండెలో గునపం".
(యంగముని వ్యవసాయం - పు : 407)

(22) "ఏనుగెక్కినంత సంబరమయింది".
(నీలవేణి - పు : 9)

(23) "రేపిన తేనెటీగ తుట్టెచుట్టూ మూగే యీగల్లా ఆలోచనలు మనసు చుట్టూ ముసురుకుంటూ".
(నీలవేణి - పు : 11)

(24) "తెల్లవారు ఝామున పిల్లతుమ్మెదలు జోకొట్టినట్లుంటే హాయిగా
కన్నుమూశాను"
(నీలవేణి - పు : 11 )

(25) "పంతులమ్మకు పాఠం ఒప్పజెప్పే కుర్రాడిలాగ పలికాడు".
(నీలవేణి - పు : 12)

(26) "అందమనే ముసలి చెట్టుకు కొత్తగా చిగురించిన రెమ్మవలె వున్నావు".
(యంత్రం - పు : 113)

(27) "పట్టాలు తిరగబడ్డ రైలు బండి లాంటి జీవితం ఆమెది".
(ఈ గుండె కరగదు - పు : 125)

(28) "కడిగేసిన బానలా ఖాళీ అయ్యింది కడుపు".
(అంతరం - పు : 382)

(29) "ఐదు సంవత్సరాల కిందటి జ్ఞాపకాలు బోరులోనించి నీళ్ళు ఎగజిమ్ముకుని
వచ్చినట్లుగా మనసు పొరల్లోంచి తన్నుకొచ్చాయి".
(కరవు రాగం - పు : 345)

(30) "నల్లని ఆకాసం తెల్లని సుక్కలతో బియ్యప్పిండి ఎగజల్లినట్టుండాది".
(తొందరపడి ఒక కోడి ముందే కూసింది - పు : 133)

(31) "నా కపాలంలో ఏదో పెఠేల్మని పగిలినట్లుగా అన్పించింది".
(చనుబాలు - పు : 203)

(32) "దిక్కూ తెన్నూ తెలియని సుడిగుండంలో తగులుకొన్నట్లు".
(కాలచక్రం - పు : 15)

(33) "వేరుపడ్డ దీవి గడ్డ లాంటి వాణ్ణి చేసింది".
(ఈ గుండె కరగదు - పు : 121)

ఈ విధంగా కడప కథాసంకలనంలోని రచయితలు తమ కథల్లో సందర్భోచితంగా ప్రయోగించిన మాండలిక పధాలు, జాతీయాలు, సామెతలు, జంట పదాలు, ధ్వన్యనుకరణ శబ్దాలు వారి సాహిత్యానికి మెరుగులు దిద్దాయి. అంతేగాకుండా ప్రాంతానికి అనుగుణంగా సాదృశ్యాలను ప్రయోగించడంలో కడప ప్రాంత రచయితలు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ ప్రయోగాలతో కథల్ని సామాన్య పాఠకులకు దగ్గర చేయడమే గాక కథానిక సాహిత్యానికి 'కడప కథ' సంకలనంలోని రచయితలు వన్నె తెచ్చారు.

# 5. పాద సూచికలు

(1) పదబంధ పారిజాతం - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి - పు : 5

(2) ఆంధ్ర శబ్ద రత్నాకరం - చెలమచెర్ల రంగాచార్యులు - పు : 40

(3) తెలుగు సామెతలు - జన జీవనం - డా॥ పి. నరసింహారెడ్డి -పు : 3

(4) సామెతలు (పీఠిక) తెలుగు సామెతలు - ఆంధ్ర సాహిత్య అకాడమి - పు:2

(5) సామెతలు (పీఠిక) తెలుగు సామెతలు - ఆంధ్ర సాహిత్య అకాడమి- పు:32